*ఒకరి సుఖ సంతోషాలకొరకు జీవితం అంకితం చేయడం అందరికీ సాధ్యం కాదు. సాధ్యమైన సందర్భంలో, ఏకాగ్రమైన ఈ లక్ష్య సాధనలో ఎవరి మనసు వారికే అవగతం కాకుండా పోవచ్చు. అయినప్పుడు ఎదుటివారికి సుఖం చేకూర్చే మార్గం ఎలా తెలుసుకొనడం?*

---

సుధాకరరావులో మళ్ళీ భావసంచలనం కలిగింది.

కప్పులో కాఫీ పోస్తూవున్న వాసంతి యిది గ్రహించింది.

సుధాకరరావు భ్రుకుటి ముకుళించి, కన్నార్పకుండా ఎదురుగా టీపాయిమీద ఉన్న పార్సిలు వైపు తదేకంగా చూస్తున్నాడు. నిట్టూర్పుల సెగలు చిన్ని శబ్దాలు చేసుకుంటూ బహిర్గతం అవుతున్నాయి అప్పుడప్పుడే.

రాబోయే ఆఘాతానికి తట్టుకోవడం ఎలాగ, ప్రసంగం మార్చడం ఎలాగా అని వాసంతి లేత హృదయం తన్నుకుంటూంది.

"వాసంతీ!"

వాసంతి తలెత్తి సుధాకరరావును సాభిప్రాయంగా చూసింది. సుధాకరరావు దృష్టి మార లేదు. పార్సిలుమీదే ఉంది.

"జీవితం అనునిత్యం జరిగే సంగ్రామం! అందులో గెలుపూ, ఓటమీ భగవన్నిర్ణయాలు; ఎదురీది మానవుడు మనలేడు."

"ఇప్పు డెవరు కాదన్నారు! కాఫీ తాగు మావయ్యా చల్లారిపోతూంది." అనుకున్నట్లే అయింది. మావయ్య ధోరణికి మళ్ళీ నాంది పలుకుతున్నాడు అనుకుంది వాసంతి.

"అదికాదు వాసంతీ. మానవుడు భావిని గురించి, ఏవో పగటి కలలు కంటూవుంటాడు. ఆశించేది ఒకటి, లభ్యమయ్యేది వేరొకటి. ఆశించేది లభ్యమయితే, అంతా అసూయపడవలసినంత అదృష్టవంతుడు. మాటికీ, కోటికీ ఎక్కడన్నా అలాంటివాడు వుంటే, భగవంతుడికి కూడా కన్ను కుట్టుతుంది. అది తథ్యం" అంటూ సిద్ధాంతరీకరించాడు.

దృష్టి వాసంతివైపు మరలింది. అమాయకంగా సుధాకరరావు కళ్ళల్లోకి చూస్తూంది.

"కాఫీ చల్లారిపోతుంది. తాగు మావయ్యా." ప్రాధేయంగా అంటూ కప్పు దగ్గరగా తోసింది.

కాఫీ కప్పును పెదాలకు తాకించి, "వాసంతీ, దాడు విప్పి ఆ పోర్ట్రెయిటు చూడు. ఐదు వందలు యిచ్చాను. ఎంత మంచి కళాకారుడి సున్నితమైన కుంచెకురులనుంచి వచ్చినా, ఏదో అసంతృప్తి నా మనస్సును ఆవరించింది."

"ఎంత బాగుంది! అత్తయ్య ఆయిల్ బస్టు. అచ్చు అత్తయ్యలాగే వుంది!"

"అచ్చు అత్తయ్యలాగే వుంది కాని అత్తయ్య కాదుగా?" బాధగా నిట్టూర్చాడు.

"ఏమిటో మావయ్యా మరిచిపోవడానికి ప్రయత్నించాలి కాని. అమ్మ, నాన్నకోసం నేనూ...." అంటూ వుంటే వాసంతి కంఠం రుద్ధం అయింది.

అది గ్రహించలేదు సుధాకరరావు.

"అది జరగని పని. ఈ జీవితం యిలా కుమిలి, కుమిలి పోవలసిందే."

వాసంతి కను కొలకుల్లో రెండు కన్నీటి బిందువులు నిలిచాయి.

"ఓ! నేను బాధపడటమే కాకుండా నీకుకూడా బాధ కలిగిస్తున్నానా, గతాన్ని త్రవ్వి? కాని వేదనా హృదయానికి పూరటకోసం అంటూవుంటాను ఆపుకోలేనప్పుడు; విచారించకు వాసంతీ. అది విధికృతం. క్లబ్బుకు వెళ్ళి త్వరగా తిరిగివస్తాను. పోని సినిమాకు వెళ్ళకూడదూ రిక్రియేషన్ వుంటుందేమో" అంటూ లేచి వెళ్ళిపోతున్నాడు.

"నేను సినిమాకు వెడితే నీ భోజనం ఆలస్యం కాదూ?"

"నేను పెట్టుకు తింటాను."

"వీల్లేదు."

"అయితే నువ్వు వచ్చిన తరువాతే తినవచ్చు. వెడితే వెళ్ళు" అంటూ వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఇది మొదటిసారి కాదు. భాష వేరయినా భావన ఒకటే. సుధాకరరావు ఆపుకోలేక ఏదో



అనడం, పర్యవసానంగా వాసంతి కళ్ళు నీళ్ళు పెట్టుకోవడం, దానితో తప్పుచేసినవాడిలా సుధాకరరావు "ఏదో పని వుంది" అనే మిషమీద వెళ్ళడం మామూలు అయింది.

వాసంతి ప్రతిమలా తైలచిత్రాన్ని చూస్తూ చాలసేపుండిపోయింది. "ఎంత అదృష్టవంతురాలు అత్తయ్య! గతించి సంవత్సరం అయినా నేడులా బాధపడుతున్నాడు మావయ్య" అనుకుంది.

కాలచక్ర గమనంతో ఎన్నో మార్పులు వచ్చాయి.

అమ్మా, మావయ్యా యిద్దరే తాతయ్య సంతతి. అమ్మ కలిగిన పదిహేను సంవత్సరాలకు మావయ్య పుట్టాడు.

అమ్మకు చిన్నతనంలోనే పెళ్ళిఅయింది. అప్పటికి నాన్నకూడా బాగా చిన్నవారట. నాన్నది అంత వున్న కుటుంబం కాదు. అప్పట్లో తాతయ్యకు నలభై ఎకరాల మాగాణి ఉండేది.

నాన్నకు చదువులోవున్న చురుకుతనాన్ని గ్రహించి; తాతయ్య నాన్న చదువుభారాన్ని పైన వేసుకున్నారు.

నాన్న బి. ఏ. చదువుతూవుంటే మావయ్య పుట్టాడు. "మావాడు పెద్దయి ఉద్ధరించేది ఎప్పుడో. అల్లుడే నాకన్నీ" అనేవారట తాతయ్య.


నాన్న ఎమ్. ఎ.,ఎమ్. ఎల్. అయి సబ్‌జడ్జి అయ్యారు. అమ్మమ్మ, తాతయ్య అల్లుడు జడ్జి అయినందుకు మురిసిపోయారు.

తాతయ్య పరిస్థితి తారుమారయింది. మూకుమ్మడిగా వచ్చిన చిక్కులలో యిరుక్కుపోయారు. పర్యవసానంగా నలభై ఎకరాల మాగాణీ హరించుకుపోగా నాలుగు ఎకరాలు మిగిలింది. ఘనంగా జరిగిన జీవితం, వార్ధక్యంలో సరిపోయీ సరిపోని భుక్తితో కాలక్షేపం చేయవలసిన స్థితికి దిగ



# తెలిసిన విలువలు

## గాడేపల్లి సీతారామయ్య



జారింది.

అయినా తాతయ్యలో గాంభీర్యం మాత్రం సడలలేదు. అమ్మమ్మ మాత్రం అప్పుడప్పుడు అమ్మతో చెప్పుకుని కళ్ళు ఒత్తుకునేది.

మావయ్య ఎంత తెలివైనవాడై, ఇంటర్లో క్లాసు ...న్నా తప్పనిసరియై పై చదువుకు స్వస్తి చెప్పవలసివచ్చింది. నాన్న మావయ్యను తన దగ్గర వుంచుకు చదువు చెప్పిస్తానని ఎన్నిసార్లు అన్నా, తాతయ్య వినలేదు. "బాకీ తీరుద్దామనా" అనేవారట నవ్వుతూ. "మావాడిని అల్లుడుగా చేసుకునే పక్షంలో చెప్పించుకో చదువు" అనే వారు తాతయ్య. నాన్న ముభావంగా ఊరుకునే వారు. "ఎంతైనా ఎవరి సంతతి బాగుపోగులు వాళ్ళు చూసుకోవటంలో తప్పులేదు. నాకొడుక్కు, తన కూతుర్ని ఇమ్మని ఏనాడూ బలవంతం చేయను" అనేవారట తాతయ్య; అమ్మమ్మ అమ్మతో ఒక రోజున అనగా తను విన్నది.

## తెలిసిన విలువలు

అమ్మమ్మ, తాతయ్య ఒకే సంవత్సరంలో పోయారు. అప్పటినుంచి మావయ్య రావటం అరుదయింది. ఎప్పుడైనా వచ్చినా అమ్మను చూసి, బలవంతంమీద ఒక పూట భోంచేసి వెళ్ళిపోయేవాడు. దిగజారిన స్థితికి క్రుంగిపోయి, చిక్కి శల్యమయ్యాడు.

అమ్మ, మావయ్య వెళ్ళిపోయాక కుళ్ళి, కుళ్ళి ఏడ్చేది. ఇది ఏమీ నాన్న పట్టించుకునే వారు కాదు. "మీ ప్రస్తుత హోదాకు ఎవరి ఆస్తి కారణమో విస్మరిస్తున్నారు. వాడి ఆస్తి. వాసంతిని యిచ్చి ఋణం తీర్చుకోండి!" ఒక రోజున తన వివాహ ప్రసక్తిలో అమ్మకు, నాన్నకు వచ్చిన కీచులాట—

"అన్నీ నిజమే. అయినా నా వాసంతికి ఫారిన్ రిటర్న్డో, అథవా ఐ. ఎ. ఎస్. ఆఫీసరన్నా కావాలి. బోలెడు ఆస్తి వుండాలి." తన భావిని గురించి ఆయన అభిప్రాయం వ్యక్తపరిచారు.

'నిజంగా నాన్న తన అభిప్రాయాన్ని అక్షరాలా గ్రహించినట్లున్నారు. అవును. నా భర్త ఐ. ఎ. ఎస్. నేను ఆఫీసరుగారి భార్యను. స్నేహితుల మధ్య ఎంత గౌరవ ప్రతిపత్తి. ఎంత హుందాగా ఉంటుంది!' గుమ్మం చాటునుంచి నాన్న మాటలు వింటూన్న తనలో అహం పొటమరించి అనుకొన్న మాటలు.

"మనకు ఆస్తికి ఏమి లోటు? ఉన్నది అది ఒకర్తేగా? ఇంటర్లో క్లాసు వచ్చింది. పై చదువు చదివి తప్పక ఐ. ఎ. ఎస్. అవుతాడు."

"అయినవాడు కావాలి. వాసంతి బి. ఏ. అని పించుకోవాలి. అబ్బాయి అయినా, అమ్మాయి అయినా అదే. అందానికి అందం, ఆస్తికి ఆస్తి— అన్నీ కావాలి. చూస్తూ తాడూ బొంగరంలేని దారినపోయే దానయ్యకు ఇవ్వలేను. ఈ విష యంలో నీ జోక్యం అనవసరం." నాన్న గొంతుక కోపంతో జీరవోయింది.

అమ్మ మూడు రోజులు కుమిలి కుమిలి ఏడ్చింది. నాన్న పట్టించుకోలేదు. తన భావి ఉన్నతి విషయంలో నాన్న అభిప్రాయం తనకు ఆనందాన్నే కలుగజేసింది. కాని అమ్మ విషాదం, మావయ్య జాలిగొలిపే ఆర్థిక మాంద్యం హృద యాన్ని గాయపరిచేవి.

రాను రాను మావయ్యలో తనను పెళ్ళి చేసు కోనా లనుకున్న ఆశ అడుగంటింది. నాన్న సుము ఖంగా లేడని గ్రహించి, బీద కుటుంబంలో పిల్లను పెళ్ళి చేసుకున్నాడు.

ఆ పెళ్ళికి నాన్న కాని, అమ్మకాని వెళ్ళలేదు. అమ్మ వెడతానన్నా, నాన్న ఒప్పుకోలేదు. మావయ్యపేర నాన్న రెండు వందలు మనిఆర్డరు చేశాడు. వాపసు వచ్చింది సొమ్ము. సమాధానంగా వ్రాసిన కవరు, పోస్టుమన్ చేతినుంచి తీసుకుని, ప్రథమంగా తనే చదివింది. బాగా జ్ఞాపకం. పెళ్ళి సవ్యంగా జరిగిందనీ, ఏవో పని తొందర్లలో రాలేకపోయి ఉంటారని విశ్వసిస్తున్నాననీ అంటూ, "బావా, కూటికీ గుడ్డకూ ముఖం వాచిన కుటుం బంలో పిల్లను పెళ్ళి చేసుకున్నాను. శిస్తు సొమ్ము సరిపోయింది. నీ రెండు వందలూ అవసరం ఉండదని తోచి త్రిప్పి పంపాను. క్షమిస్తావని, మరోలా అనుకోవని తలుస్తాను. అక్కయ్యకు నా పెళ్ళిలో వచ్చే లాంఛనాలు వంద రూపాయలనూ ఈవేళ పంపుతున్నాను. తీసుకుని దీవించమను. అక్కయ్యకు ఆ సొమ్ము లెక్కలోనిది కాకపోవచ్చు. అయినా అది ఆమె జన్మతః వచ్చిన హక్కు."

అమ్మకు ఆ ఉత్తరం పంపి, గదిలోకి వెళ్ళి తలుపులువేసుకుని భోరని ఏడ్చింది. మావయ్య లేఖలో ఎంత దైన్యం నిండిఉంది!

మావయ్య పెళ్ళి అయ్యాక నాన్నలో మార్పు వచ్చింది. మావయ్యమీద జాలికి పర్యవసానంగా

18 మూలికలతో తయారుచేయబడిన ప్రప్రథమ



ఆయుర్వేదిక
పేస్టు మరియు పౌడరు

మామూలుగా శుభ్రపరచటమంటే ఏ పేస్టైనా పౌడరైనా చేయగలదు. కాని, చిగుళ్ళను దృఢ పరచే వస్తువులు వాటిలో ఉన్నవా అని ఆలోచించండి. ప్రప్రథమ ఆయుర్వేదిక 'విక్కో వజ్రదంతి' (పేస్టు మరియు పౌడరు) లోగల 18 మూలికలు మీ చిగుళ్ళను గుణపరచి, పళ్ళను గట్టిగానుంచును తొలిసారి ఉపయోగములోనే సంతృప్తినిచ్చును

విక్కో వజ్రదంతి
పేస్టు మరియు పౌడరు




Vicco Laboratories Private Limited
DADAR T.T.-BOMBAY-14.

సదభిప్రాయం ఏర్పడింది. కమల అత్తయ్యను, మావయ్యను వచ్చి పది రోజులుపాటు ఉండి వెళ్ళమని వ్రాశారు. సమాధానం మావయ్య చాల వినయంగా ఇచ్చాడు. ప్రక్క గ్రామంలో తన స్నేహితుడి కంపెనీలో మూటయాభై రూపాయల ఉద్యోగం అయిందని, కంపెనీ క్రొత్తగా ప్రారంభించడంచేత ప్రస్తుతం రావ టానికి సావకాశం లేదని, ఏమాత్రం సావకాశం వచ్చినా, తప్పకుండా వచ్చి, వీలైనంతకాలం ఉంటానని వ్రాశాడు. కాని రాలేదు.

మావయ్యకు ఉద్యోగం అయిన మూడు సంవత్సరాలకు కంపెనీ బ్రాంచి ఈ ఊళ్ళో పెట్టడంతో, మావయ్యా, అత్తయ్యా ఈ ఊరు వచ్చారు. ఇల్లు దొరికిందాకా ఒక వారంపాటు ఇక్కడే ఉన్నారు. మావయ్య బ్రాంచికి మేనేజరు. మూడువందలు జీతం.

మావయ్యమీద నాన్నకు అమితమైన ఆదరం ఏర్పడింది.

మావయ్యలో బీదతనంతో మరుగుపడిన సంస్కారం మెరుగులు దిద్దుకుంది. అత్తయ్య సాహచర్యం మావయ్యకు వెలుగుబాట అయింది.


అత్తయ్య తనకన్న రెండు సంవత్సరాలు పెద్దది. మావయ్య మాట, ఆమెకు వేదవాక్యం. బాధ్యతలు చుట్టుముట్టడంచేత, వయస్సుకు మించిన పెద్దరికం ఉట్టిపడేది.

అత్తయ్య ఆర్థికంగా కుంటువడిన కుటుంబంలో పుట్టినా, పెరిగినది పట్నవాసం కావడంచేత మెట్రిక్ ప్యాసు అయింది. హిందీలో ప్రవేశముంది.

అత్తయ్య ఏం అంత పెద్ద అందమైనది కాకపోయినా, బాగా సంస్కారం అలవడిన వ్యక్తి అని మాత్రం ఒప్పుకుతీరాలి. చిరునవ్వు చిందించే ఆ సన్నని పెదాలు, నవ్వితే గుంటలువారే ఆ చెక్కిళ్ళు, అత్తయ్యను అంతా అందమైనది అన టానికి కీలకాలు. ఇంకో స్త్రీ ఎవరైనా అయితే జుట్టు పీక్కుని ఏడ్వవలసిన పరిస్థితిలో అత్తయ్య అదే హాసరేఖతో గంభీరంగా ఉండగలగటం ఆమె ప్రత్యేకత. మావయ్య భాషలో, "అత్తయ్య విండుకుండ. తను వెలితి కాకుండా వెలితి కుండను పూరించడం మీ అత్తయ్య అసమాన విద్య."

మావయ్య మధుర జీవన ప్రవంతిలో జల పాతాలు ఏర్పడ్డాయి. అత్తయ్య పురిటికి పుట్టింటికి వెళ్ళి, కళ్ళు మూసింది. చివరి ఘడియల్లో అన్నా ఒక్కసారి చూడలేకపోయి నందుకు ఇప్పటికీ బాధపడుతూ ఉంటాడు. "నేను ఉండిఉంటే, ఏం చెప్పివుండేదో?" అని తనలో తను సతమత మవుతూ ఉంటాడు.

తనకో దారి చూపించకుండా, తల్లితండ్రి అకాల మరణాలను పొందారు. కేన్సరుతో అమ్మ, రాచపుండుతో నాన్న పది మాసాల తేడాలో పోయారు. నాన్న కమల అత్తయ్య పోయిన నెలకు పోయారు. అమ్మకు కేన్సరు పొడ చూపిన దగ్గర



లలిత్ మహల్ (మైసూరు) ఫోటో—మోహన్ కేట్కర్ (అమరావతి)

నుంచీ, అత్తయ్యా, మావయ్యా అద్దె యిల్లు వదిలి ఇక్కడికి వచ్చారు. దానికి నాన్న బల వంతమే కారణం.

అమ్మకూ నాన్నకూ బహుముఖంగా అత్తయ్య చేసిన సేవ మరవలేనిది. కుడి ఎడమలు తేడా లేకుండా చేసింది. అత్తయ్య పోయినప్పుడు నాన్న ఎంతగానో పరితపించారు. ఎవ్వరూ చూడకుండా చూసి కళ్ళు ఒత్తుకునేవారు. "పరాయి పిల్ల అయినా హృదయాన్ని పంచి యిచ్చింది వాసూ. రెండు కళ్ళల్లో ఒక కన్ను లొట్టపోయింది. ఈ బాధతో నేను బ్రతికేకన్నా......" అని భోరుమనే వారు తరుచు.

నాన్న, తనను తొలి రోజుల్లో తేలికగా చూసినా అంతిమదశలో ప్రాణ సమానంగా చూసుకున్నా మార్పులేదు మావయ్యలో. మావయ్య మాటలలో సత్యం ఉంది. "పిదన్నా ఆశిస్తేనే మనస్సు డీస పోయింటుమెంటు ఫీలవుతుంది. ఆశ లేకుండా నిస్వార్థంగా ఏ పని చేసినా ఆత్మానందం కలుగుతుంది. అభిమానం ఉన్నచోట తృణానికి ఆత్మసమానంగా ఒడ్డగలిగిన ఔదార్యం కావాలి." మావయ్యనునాన్న బాగా అర్థం చేసుకున్నారు కాబట్టి, తనను అతనికి అప్పగించారు. "వాసూ, మావయ్య ఏం చేసినా నీ సుఖంకోసం చేస్తాడమ్మా. నేనూ, అమ్మా లేని లోటు మావయ్య తీరుస్తాడు. నమ్మి ప్రవర్తించు" అనేవారు.

"అమ్మాయీ, వాసంతీ!"

ఒక్కసారి వాసంతి మనస్సు గతుక్కుమంది. 'మావయ్య వచ్చి ఎంతసేపయింది?'

"ఎంత కష్టపెట్టాను లేత హృదయాన్ని! ఇంకా అత్తయ్య బస్టుమీదే వుందా దృష్టి? నేను అప్పుడే మరిచిపోయాను."

నిజం నేతిబీరకాయ సత్యం అని తెలిసీ—"ఎంతసేపయింది మావయ్యా వచ్చి? ఏదో పరాగ్గా ఉన్నాను. నువ్వు వచ్చిన సంగతే గమనించలేదు" అన్నది.

"అంతా ఇప్పుడే. క్లబ్బుకు వెడుతూఉంటే పోస్టుజవాను, మధూ వ్రాసిన ఉత్తరం ఇచ్చాడు. నీకు మధూ సంగతి చెప్పేఉంటాను. మధూ, రాజా అన్నదమ్ములు. మధూ పెద్దఅయినా చదువులో మందకొడి. అందుచేత అన్నను కలుపుకో కలిగాడు రాజా, నా ఇంటరులో ఈ ఇద్దరూ నా రూమ్ మేట్సు. ఈ మధ్య నేను మధూపేర ఒక ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు ఇది. ఆ శుభ వర్తమానాన్ని నీకు అందచేయాలని తిరిగి వచ్చాను."

"ఏమిటో విశేషం?" రాని నవ్వును పటిస్తూ చిలిపిగా చూసింది సుధాకరరావు కళ్ళల్లోకి.

"అదృష్టవంతురాలివి వాసంతీ. మీ అమ్మ నాన్న కోరికలు ఫలించడానికి యథాశక్తి ప్రయత్నిస్తున్నాను. పెద్దవాళ్ళు అక్కయ్యా, బావా భారం నామీద ఉంచినందుకు, న్యాయం చేయ కలుగుతానా లేదా అని క్షోభ పడ్డాను. కాని దైవం అనుకూలించింది. నువ్వు అదృష్టవంతురాలివి."

"కథంతా ఉపోద్ఘాతమేనా మావయ్యా, అసలువిషయం చెప్పడంఉందా?" చిలిపిగానవ్వింది.

"నెల్లూరులో డాక్టరు సంజీవయ్యగారి రెండవ అబ్బాయి, నా మిత్రుడు రాజా, రెండు నెలలయింది అమెరికానుంచి తిరిగివచ్చి. విమానాశ్రయంలో దిగగానే వేయి రూపాయలు జీతం యిస్తామని, అయిదు సంవత్సరాల బాండు వ్రాయమని ఏదో కంపెనీ యజమాని కోరేడట.

## తెలిసిన విలువలు

ప్రస్తుతం ఇంకా ఎవ్వరికీ మాట ఇయ్య లేదు. ఉత్తరాలమీద ఉత్తరాలు వస్తున్నా యుట. అదృష్టవంతుడు.''

''బాగానే ఉంది. మీ రాజు ఫారిన్ రిటర్న్డ్ అయినందుకూ, నేను అదృష్టవంతురాలిని అన టానికీ సంబంధం ఏమిటి? చెప్పదలచుకున్నది ఒకటి, చెప్పేది వేరొకటి. మామయ్య పూర్తిగా మారిపోతున్నాడు.''

''ఎప్పుడూ మారడు మామయ్య, పిచ్చి ఎక్కితే మినహా.''

''అది జరగదులే. అయినా తుది మాటలు నా స్వగతం'' అంటూ ఫక్కున నవ్వి, ''అసలు విషయం?'' అన్నది.

''ఏమీలేదు. మధూకు వ్రాసిన కవరులో నీ బస్టు కాపీపెట్టి పంపాను. రాజు నిన్ను పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించాడు.''

''నాతోటి ముందు చెప్పకుండా వ్రాశావా? ఎంత పని చేశావు?''

వాసంతి ముఖంలో హాసరేఖ మాయమయింది.

సుధాకరరావు చెప్పుకుపోతున్నాడు—''ఎంత ఆప్యాయత! నా పెళ్ళికి నా తరఫున వచ్చిన ఆత్మీయులు వాళ్ళే. నా మనుగుడుపులు వాళ్ళ యింట్లోనే జరిగాయి.'' చెమర్చిన కళ్ళను రుమాలుతో తుడుచుకున్నాడు.

వాసంతి పయిట చెరగుతో కళ్ళు ఒత్తుకుంది.

''ఇవి ఆనందబాష్పాలు వాసంతీ. ఆత్మీయత ఎంత సబ్లయిముగా ఉంటుందో చూడు. ఫారిన్ రిటర్న్డ్ అయి, కమల పోయినందుకు ఆత్మీయులు పోయినట్లు బాధపడ్డాడట. అతని వివాహవిషయంలో 'Dictate, I obey' (శాసించు, నే అంగీకరిస్తా) అని వ్రాశాడు చూడు. ఆ వాక్యం చదువుతూవుంటే మనస్సు ఆనంద పులకితం అయింది. క్లబ్బుకు వెళ్ళ బుద్ధి కాలేదు. ఆ శుభ వర్తమానం నీకు తెలియ చేయడంకోసం తిరిగి వచ్చాను. త్వరలో ఇక్కడికి వస్తారట అన్నదమ్ములు. నిన్ను చూసే నిమిత్తం కాదంటారు. నాతో రెండు రోజులు గడపాలని ఉందట. రాజు నాకు ఏదో మంచి బహుమతి తెచ్చానంటాడు. కమల బ్రతికివుంటే ఆనందించేది అంటాడు. నేను బాధ పడతానేమో అని సందేహిస్తున్నాడట.అది ఏమిటో చూడాలి.'' దీర్ఘ ప్రసంగం తరువాత మంచి వక్త ముఖంలో ఆవరించే ప్రశాంతత సుధాకరరావు ముఖంలో ద్యోతకమయింది. ''రేపు కారు తీయిస్తాను బయటికి. మధూవాళ్ళూ వస్తే అవసరం వుండ వచ్చు.''

''నాతో ఇంత స్వల్ప విషయం చెప్పాలా?



పోడయిపోతుంది వాడమంటే వాడవాయను. ఏం చేసేది?''

''అది కాదు వాసంతీ. చెప్పడం సబబు. మీ నాన్న నమ్మి, నన్ను ట్రస్టీగా ఉంచినందుకు పైసా వీరుపోకుండా చూడ్డం, నువ్వు ఒక ఇంటిదానివి అయినప్పుడు, ఆస్తి పాడవకుండా అదే స్థితిలో నీకు నీ భర్తకు అప్పగించి చేతులు దులుపుకోవడం నా కనీస విధి. ఈలోగా నా స్వార్థం తలెత్తకూడదు.''

''ఎంత నియమాలు అనుకున్నా ఎదుటివాళ్ళను బాధ పెట్టకూడదు. కారు వాడమంటే వాడకపోతివా యను. ఏం చేయను? అన్నట్లు ఫ్లాస్కులో కాఫీ వుంది. ఇస్తాను ఉండు. కబుర్ల ధోరణిలో నా విధి మరచాను'' అంటూ పేలవంగా నవ్వింది.

''విధి......విధి!'' సుధాకరరావు హృదయం పదే పదే ప్రతిధ్వనించింది.

''ఇప్పుడే యింత పరాకయితే, ఫారిన్ రిటర్న్‌డ్ భర్తనుపొందాక జ్ఞాపకముంటామా అమ్మాయికి!''

''ఉండాలని ఏముంది? మీరే నియమబద్ధమైనవాళ్ళు. మేం తిన్న తిండి అంగుడి దాటకముందే మరిచిపోయేవాళ్ళం. అసలు నాకు ఏ ఫారిన్ రిటర్న్‌డూ వద్దు బాబూ. అసలు నాకు పెళ్ళేవద్దు. ఇలా బ్రతకనీయి'' అంటూ విసాలున లేచి వెళ్ళింది.

వాసంతి చిరుకోపం ప్రదర్శించే అప్పుడు యౌవన సిరు పాల పొంగులా ముఖంలో ప్రస్ఫుటం అవుతుంది అనుకుంటూ గత చరిత్రలో బుర్ర దూర్చాడు.

ఒకనాడు వాసంతిని భార్యగా పొందితే జీవితం ధన్యం అవుతుందని పగటికలలు కన్నాడు. తన తల్లి, తండ్రి కూడ అదే ఆశించారు. కాని అదృష్టం కలిసిరాక, ఉన్న ఐశ్వర్యం అడుగంటి, అంతా మిథ్యఅయింది. మావయ్య దృష్టిలో తను పలుచనయ్యాడు. అయినా అందుకూ తను పరితపించలేదు. ఎవరో ఒకరు అని చేసుకున్న కమలతో జీవితం అనుకూలమై, స్వర్గధామం అయింది. నాలుగు సంవత్సరాలు తెలియకుండా జారుకున్నాయి.

అన్నింటికీ చెడి అలమటించే సమయంలో ఆత్మీయతను చిలకరించి, ప్రేమను రంగరించి, ప్రశాంతత చేకూర్చింది. కాని విధి బలీయం! అమృత కలశం చేయి జారింది. కమల బ్రతికి ఉన్న కొద్దికాలంలోనే మరవలేని మమతను హృదయంలో నాటి, పెంచి, శాశ్వతంగా నిష్క్రమించింది. ఆమె అనుబంధంలో మరచిన బాధను ద్విగుణీకృతంచేసి, అంతా ఒక్కసారిగా అనుభవించమని శపించింది విధి! కాకపోతే మిత్రుడి ఈ ఉద్యోగ భిక్షమాత్రం చెప్పుకో తగినది. చదివిన చదువుకూ, సంపాయించే జీతానికీ అసలు సంబంధం లేదు. జీవితంలో కలిసివచ్చింది ఇది ఒక్కటే!

''ఏదో పొట్ట నింపుకోలేకపోను'' అనే ధైర్యం వచ్చేటప్పటికి అమ్మా, నాన్నా జారుకున్నారు. ఆనాడు నామమాత్రంగా ఉన్న బావతో సంబంధం అనుబంధం క్రింద మారింది. గతాన్ని విస్మరించి, ఈ కొత్త బంధంలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అయినది కూడా కొంతకాలమే! దానికి కూడా విఘాతం జరిగింది. అవతల అక్కయ్య, బావ పరమపదించడం, ఇవతల కమల కళ్ళు మూయడం—అంతా సంవత్సరం వ్యవధిలో జరిగిపోయాయి. జీవితంలో కవాటాలన్నీ మూసుకుని, మళ్ళీ అంధకారం ఆవరించింది. బావ వాసంతిని తన అజమాయిషీలో ఉంచడంతో బాధ్యతలు చుట్టుముట్టాయి. ఆస్తి జాగ్రత్తగా కాపాడాలి. బావ అభిప్రాయానుసారం వాసంతికి ఉత్తముడు, ఫారిన్ రిటర్న్‌డు భర్తను చేయువలసిన గురుతర బాధ్యత తనమీద ఉంది.

రాజా ఉత్తముడు. లక్షలు కుప్పినా అలాంటి పెళ్ళికొడుకు దొరకడం దుర్లభం. రాజాకు తనమీద ఉన్న గౌరవం అటువంటిది. తన మాట ఒక శాసనం. ఆనందంలో కళ్ళు మూసుకుని తనలో తను నవ్వుకున్నాడు.

అయినా ఒకనాడు తను ప్రేమించిన వ్యక్తికి తన చేతులమీదుగానే పెళ్ళి కావలసి ఉంది. విధాత ఎన్ని రకాలయిన శిక్షలను పెట్టాడు! 'శిక్ష......శిక్షా!.....కాదు, కాదు—ఇది పరీక్ష!—ఏ పరిస్థితిలోనూ నా స్వార్థం తలెత్తకూడదు. అక్కయ్య, బావల ఆత్మలు పరితపించకూడదు. నా శేష జీవితం వాసంతి సౌఖ్యానికి అంకితం కావాలి.......కావాలి.....'

సుధాకరరావుకు తెలియకుండా చివరిమాటలు పెదాలను దాటాయి.

''ఏమిటి మావయ్యా 'కావాలి...కావాలి'... ఏం కావాలి? వేడి వేడి కాఫీయా? ఇంకా ఏమైనానా? ఆకలేస్తూందిఏమోబిస్కట్లు తేనా? నాతో చెప్పకపోతే ఏం చేసేది మావయ్యా'' అంటూ జాలిగా చూసింది.

''ఏమీ వద్దు వాసంతీ. నిజంగా ఆకలిలేదు. నమ్ము.''

''మరి ఏమిటి 'కావాలి?' అంటున్నావు.''

''నీ సౌఖ్యం! అక్కయ్య బావలు చూడ నోచుకోనిది, నేను చూసి ఆనందించాలి అనుకుంటున్నాను.''

''అంటే నాకు పెళ్ళిచేసి పంపి, హాయిగా, స్వేచ్ఛా విహంగంలా రెక్కలు విచ్చుకుని విహరిద్దామనా?''

''కాదు. కంటికి రెప్పలా నువ్వు ఎక్కడఉన్నా కనిపెట్టుకుంటూ ఉండి, ఒకనాడు పండుటాకులా రాలిపోదామని.''

వాసంతి కనుకొలకులనుంచి కన్నీటి బిందువులు ధార కట్టాయి. ''అబ్బా! ఎంత తీయటి పదజాలంలో, ఎంత కరకు కత్తుల పెళపెళా భావాలు! నా ఆత్మను చిత్రవధ చేస్తావా మావయ్యా? నాకు పెళ్ళిచేసి పంపి, కమల అత్తయ్యను మరిచిపోలేక, వ్యథతో క్రుంగి కృశిస్తావా? పనికిరాదు మావయ్యా. నేను నీ నీడ వదలలేను. నీకు నామీద ఎంత ప్రేమ, అభిమానం ఉందో, అంతకు పదింతలు నాకూ ఉంది. అమ్మకు, నాన్నకు నువ్వూ, అత్తయ్యా చేసిన సేవ, నేనంటే నువ్వు చూపే ఆదరం ఊహకందనివి. కడుపున పుట్టి అమ్మకు, నాన్నకు


# తరచుగా మూత్ర విసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకు రోగిని మృత్యు సమీపానికి తీసుకువస్తుంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగాకాని శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వ సాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూవుంటవి. ఈ లక్షణాలు గోచరించటంతోనే తగిన చికిత్స చేయకపోతే, ఉత్తరోత్తరా అమితదాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్ళలో సంకటం, బరువు తగ్గటం, శరీరమంతా పొట్లు, కీళ్లవాతం, కళ్ళపొర, టి. బి, కురుపులు, రాచపుండు, తదితర తీవ్రవ్యాధులకు గురికావలసి వస్తుంది. ''వీనస్ చారం'' బిళ్లలు వాడి వేలాది మంది శమనంపొంది మృత్యువాతపడకుండా తప్పించుకున్నారు. ''వీనస్ చారం'' బిళ్లలు ప్రాచీన యూనాని వైద్యసిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా అరుదైన-మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్సమొదలుపెట్టిన రెండవ, లేదా మూడవ రోజునుంచే అమితదాహం మూత్రంలో చక్కెర తగ్గి, తరుచుగా మూత్రవిసర్జన చేయుటం నిలిచిపోతుంది. కొద్దిరోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్లనిపించును. ''వీనస్ చారం'' ఖర్చు తక్కువ. నిరపాయమయినది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠినపథ్యాలుకాని, ఉపవాసాలు చేయవలసిన అవసరంకాని వుండవు. రోగులు పుష్టికోసంబలప్రవర్ధకమైన వివిధపదార్థములను భుజించవచ్చును. కోరినవారికి పూర్తివివరాలుకల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు 6.75 న.పై. మాత్రమే. పోస్టేజి నిమిత్తము రూ. 1—6. న.పై. అదనము. (ఒకేసారి రెండు, అంతకు పైగా, సీసాలను తీసుకున్న పోస్టేజి వుచితం.) దొరకు చోటు :

**(Selling Agents) :**
**Barrys Commercial Corporation (A.H.W.)**
**27/A Dhurumtollah Street,**
**Calcutta-13.**

నేను అంత చేయలేకపోయాను. తీర్చుకోలేని ఋణాన్ని నా తలకు రుద్దావు. కొంతలన్నా తీర్చుకునే అవకాశం ఇవ్వకుండా పంపివేద్దామనా? వల్లకాదు. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోనంతకాలం నాకూ వద్దు పెళ్ళి.'' బాధగా నిట్టూర్చి తలఎత్తి చూసింది.

అప్పుడే రెండు నెలలుగా ప్రయత్నిస్తూంది. మావయ్య మళ్ళీ పెళ్ళి చేసుకుంటే కాని మనిషి కాడని, మళ్ళీ పెళ్ళి చేసుకోమని చెప్పాలని అనుకుంటూంది. కాని వయస్సు అడ్డుతగిలి, వెనకాడుతూంది. కాని ఈనాడు అనుకోకుండా ఈ మాటలు వెలువడ్డాయి. మావయ్య ముఖంలో మార్పు గమనిద్దామని తలఎత్తి చూసింది.

# తెలిసిన విలువలు

సుధాకరరావు కుర్చీలో లేడు. అప్పుడే గుమ్మందాటి వెళ్ళిపోతున్నాడు. కాఫీ తాగలేదు.

వాసంతి, కాఫీ గ్లాసుతో చరచరా వెళ్ళి సుధాకరరావు గమనానికి చేతిని అడ్డంగా ఉంచి, కాఫీగ్లాసు అందించింది. మూడు గుక్కలలో కాఫీ తాగి, గ్లాసు తిరిగి ఇస్తూ, "క్లబ్బుకు వెళ్ళివస్తాను వాసంతీ. కొంచెం ఆలస్యం కావచ్చు. నువ్వు క్యారియరు రాగానే తినేయి."

"నీకు వేయని ఆకలి నాకు వేస్తుందా, ఇంట్లో ఉండేదాన్ని? నువ్వు వచ్చాకే తినవచ్చు."


## మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును

నిక్సొడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సొడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, కాంతివంతముగాను శుభ్రపడుట గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎఱ్ఱని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సొడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపు రంధ్రములలో దాగియుండు వేలవేల క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మవ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, కాంతివంతముగాను శుభ్రము చేయు నిక్సొడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.





"సులేఖ"
మరియు
"బ్రీఫ్‌మన్"
ఫౌంటెన్‌పెన్‌లు

PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY - 67.





## పూర్వు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**


మావయ్యను అర్థం చేసుకోవటం ఎంత కష్టంగా ఉంది? ఎంతసేపూ మావయ్య కబుర్లు ప్రసంగ ధోరణిలోనే ఉంటాయి. అతనిలో ఎప్పుడూ సాగర గర్భంలో జరిగే సంకుల సమరం లాంటి బాధల ఒరిపిడి ఉంది. తనకు బాధ కలుగుతుందని మూత ముప్పిడిగా, పైకి నిశ్చలంగా కనబడటానికి ప్రయత్నిస్తున్నాడు. చిన్న గులకరాయి తాకిడికి నిశ్చలమైన నీటిలో వలయాలు ఏర్పడినట్లు మావయ్యలో మామూలు విషయం సంచలనం కలిగిస్తూంది.

మావయ్యను మనిషిగా చేయడం ఎలాగ? తనకు మావయ్యా, మావయ్యకు తనూ తప్ప అండ ఎవ్వరూలేరు ఈ ప్రపంచంలో. తనకు మంచి సంబంధం చేయాలని అతను ఎలా తాపత్రయ పడుతున్నాడో, అలాగే మావయ్య బాగు సర్వదా తనూ కోరుతూంది. కాని ఏది ఆచరణ యోగ్యమో నిర్ణయించలేకుండా ఉంది.

క్లబ్బుకు వెడుతూ, సుధాకరరావు చాల బాధపడ్డాడు. ఏ ప్రసంగం వచ్చినా యిట్టే మనస్సు గత జీవిత పుటల్లోకి కదలిపోతూంది. అనుకోకుండా పుటలు రెపరెపలాడుతూ తిరిగిపోతున్నాయి. కమలను మరచిపోవడం అసాధ్యంలా తోస్తూంది. స్వర్గ సౌఖ్యాన్ని చవిచూసి, మరవలేని మమతను హృదయంలో నాటి, చెరగని ముద్రవేసి నిష్క్రమించింది. ఆనాటి మధుర స్మృతులు తలచుకుంటే యీనాడు మనస్సు బరువెక్కుతూంది. కమలతో ఎడబాటు కంటకంగా వుంది. మననం చేసుకోవటం ఎంత ఆనందమో, పర్యవసానంగా బాధ అనుభవించడం అంతకు పదిరెట్లు కష్టంగా ఉంది. బాధను మూట కట్టుకు ఉంచుకునే శక్తికూడా బొత్తిగా నశించింది. లేకపోతే వాసంతి మనస్సు వికలం అవుతుందని తెలిసి ఏమిటి యీ ప్రేలాపన?

• • •

మధు, రాజు వచ్చి ఒక రోజుమాత్రం వుండి వెళ్ళిపోయారు. ఒక విషయం మాత్రం సుధాకరరావుకు అంతు పట్టలేదు—

రాజు అంతటివాడిని భర్తగా పొందబోతూ, నిరుత్సాహంగా కనబడుతూంది. మధుతో చనువుగా వుంది. రాజు మాట కలిపినప్పుడు తుంచి ప్రసంగం మార్చేది. కాబోయే భర్త అని, స్త్రీసహజమైన సిగ్గు అడ్డు తగిలింది ఏమో?

వాసంతి రాజు వచ్చేటప్పటికి అపరరతిలా తయారై ఆహ్వానిస్తుంది అనుకున్నాడు. కనీసం ఉత్సాహంగా అన్నా లేదు. ఉన్న చదువుకు, సంస్కారానికి, ఆకర్షణకు మెరుగులు దిద్దే జీవపదార్థం ఉత్సాహం. అది లోపించినప్పుడు, అన్నీ కుంటుపడి, ఎదుటివాళ్ళ మనస్సులమీద విపరీత ప్రభావాన్ని యిస్తాయి. ముఖ్యంగా 'పెళ్ళి చేసుకోవాలి' అనుకునే యువకుడికి పెద్ద లోటుగా తోచడంలో విపరీతంలేదు. అందులో అమెరికన్ రిటర్న్‌డ్. అక్కడ స్త్రీలలా ఉండాలని ఊహాసౌధాలు నిర్మించుకున్న రాజుకు, అసంతృప్తి

కలగవచ్చు. లేకపోతే రెండు రోజులు ఉందామని వచ్చి, ఒక రోజులోనే వెళ్ళిపోవడ మేమిటి? అయినా ఫరవాలేదు. తన మాట రాజాకు ఒక శాసనం.

శైలు ఎక్కుతూ మధు అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి. "మీ వాసంతి నీ వివాహ ప్రసక్తి తెచ్చిందోయి. ఎవర్నో, ఒకర్నిచూసి, నిన్ను పెళ్ళి చేసుకోమంటూంది. నన్ను నీతో చెప్పమని కోరింది. నా అభిప్రాయం కూడా నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మంచిది అని తోస్తూంది."

"వాసంతిగారికి మీరంటే పంచప్రాణాలు. మీ మనస్సు యీమధ్య సరిగా వుండటం లేదని చాలా వేదనపడ్డారు. మీరు లేనప్పుడు ఎప్పుడూ అన్నయ్యతో అదే ప్రసక్తి. కొంచెం మార్పు తెచ్చుకోవడానికి ప్రయత్నించ కూడదూ?" శైలు కదలిపోతూ వున్నప్పుడు రాజా, మధుకు పాడిన వంత.

వాసంతి అభిప్రాయం ఏమిటో తేల్చుకోవాలి. తానుగా ఎలాగా చెప్పదు; తమ కదపాలి అను కుంటూ వాసంతి గదిలోకి వెళ్ళాడు.

వాసంతి రాజా తెచ్చిన సుధాకరరావు, కమలల బస్టు, దంతపు చెక్కడం చూస్తూంది. చూడ టానికి చిన్నదిగా కనబడుతూవున్నా, కళాకారుడి నైపుణ్యం, జీవకళలో వుట్టిపడుతూంది. అందమైన చిన్న అద్దాల పెట్టెలో అమర్చబడి చూడ ముచ్చటగా వుంది. "గోడకు అయిల్ బస్టు తగిలించి, బల్లమీద యీ బస్టు వుంచి, చూస్తూ కూర్చుంటాడు కాబోలు మావయ్య" అని వ్యథ పడుతూంది.

"వాసంతీ!"—గుమ్మంలోనుంచే తెలియ పరచుకున్నాడు.

"రా మావయ్యా, ఎప్పుడూ లేనిది గదిలోకే వచ్చావే? కూర్చో" అంటూ లేచి నుంచుంది.

చేతులు, బస్టును సొరుగులో దాచడంలో త్వరగా పని చేశాయి.

"ఏం లేదు. కూర్చో వాసంతీ. రాజా విష యంలో నీ అభిప్రాయంకోసం."

"నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను" అంటూ ఒక కవరు అందించింది.


"అయితే ఎస్. ఇ. ఓ. గా వెళ్ళ నిర్ణయించా వన్నమాట. నాతో చెప్పకుండా అసలు ఎందుకు అప్లయి చేశావు"? అధికారం అక్షరం, అక్షరం లోనూ ప్రతిధ్వనించింది.

"నిర్ణయం కాదు. ఏదో పేపరులో కనపడితే పెట్టాను. తగిలింది. నీ అభిప్రాయం తీసుకు వెడదామనుకుంటున్నాను."

"మరి నీ పెళ్ళిమాట? రాజాకు మాట ఇచ్చావే?"

"నాకేం తొందర? నీ వివాహం మాట తేలందే నాదిమాత్రం ఎలా తేలుతుంది?"

"ఏమిటి వాసంతీ? నాకు ఇంక పెళ్ళి ఏమిటి? అపహాస్యం చేస్తున్నావా! నీకు పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకోవలసింది నేను."



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయగోపురం
(తిరుపతి)
ఫోటో— రఘు (తిరుప్పూరు)

"హాస్యం కాదు మావయ్యా. ఇంట గెలువు లేదు. రచ్చ కెక్కుతావు. నీ బాగు నీకు తెలియదు, నా బాగు చూస్తావు. మనిషిని ఎలా చిక్కి పోయావో తెలుసా?"

"ఇంక ఏం సాధించాలి? ప్రాణం నిలపెట్టు కోవడమేగా?"

"వయస్సుకు మించిన వేదాంతం! నాన్న ఏమనేవారో తెలుసా?"

నాలిక కొరుక్కుంది వాసంతి. నోరుజారింది. వదలడు మావయ్య!

"ఏమనేవాడు బావ?"

"ఏం లేదు."

"చెప్పు వాసంతీ!" లాలనగా అడిగాడు.

"మంచివే వున్నావు—"

"సందేహం ఎందుకు వాసంతీ? బావ ఏమనే వాడు?"

"ఏం లేదు. నాన్న పోయేటప్పటికి కమల అత్తయ్య పోయి మూనమే అయింది. అత్తయ్య మీద నీ అనురాగం తెలియనిది కాదు."

"అయితే యింతకూ?"

"ప్రథమంలో నిన్ను అర్థం చేసుకుని, ఆద రించి, గౌరవించనందుకు కించపడ్డారు. 'మావయ్య వుత్తి అమాయకుడు. అతని బాగే అతనికి తెలియదు. ఒంటిగాడయ్యాడు. నేడో రేపో, నువ్వూ అంతే. కొంచం కనిపెడుతూ వుండు.'"

"బావ చరమదశలో అనవసర విషయాలు మనస్సులోకి ఎక్కించుకు మధనపడ్డాడంటావా? ఈ విషయం నువ్వన్నా చెప్పలే దేం? బావ ఆత్మ పరితపిస్తూందా అయితే?"

"నిజంగా మావయ్యా! చివరి రోజుల్లో నాకు ఐ. ఎ. ఎస్. ఆఫీసర్నో, ఫారిన్ రిటర్న్డునో పెళ్ళి చేయాలనుకున్న భావనకు స్వస్తి చెప్పారు. 'చదువు కాదమ్మా ముఖ్యం. సంస్కారం. నీకు దెబ్బతగిలినప్పుడు బాధపడటం కాదమ్మా, ఎదుటి వాళ్ళ దెబ్బకు నువ్వు విలవిలలాడ గలగాలి. మావయ్య చూడు. ఒకప్పుడు నేను బాగా చూడక పోయినా, అంతిమ దశలో మీ అమ్మకూ, నాకూ, సుధాకరమే అయ్యాడు. ఎప్పుడన్నా విసుగు కున్నట్లు కాని దెప్పినట్లు కాని విన్నావా? అది సంస్కారం! మావయ్యే లేకపోతే నేను ఎప్పుడో చచ్చిపోయి ఉండేవాడిని.'"



నిరీక్షణ — చిత్రం — రావాడ కృష్ణ (ధవళేశ్వరం)

# తెలిసిన విలువలు

"అవు వాసంతీ, అవు—బావకు సేవ చేయడం నా కర్తవ్యం. ఇందులో బావ బాధ పడవలసిన విషయం ఏముంది? ప్రసంగం మార్చేస్తున్నావే! రాజా విషయంలో నీ అభిప్రాయం?"

"చెప్పానుగా. ఆడదాన్ని. విలేసి ఆరా తీస్తున్నావే! అన్నీ నా ముఖతః వినాలనా లేక నిజంగా అర్థం కాకనా? నాన్న అభిప్రాయం ఆఫీసరూ వద్దు, రిటర్న్‌డూ వద్దు—అర్ధాంగిగా అంగీకరించ లేకపోతే పాదదాసిగా అన్నా అంగీకరించు మావయ్యా" అంటూ సుధాకరరావు పాదాలకు మొకరిల్ల ప్రయత్నించింది.

సుధాకరరావు వారించాడు. "చదువుకున్న దానివి. అభిప్రాయాలకూ ఉద్రేకాలకూ బానిస కాకూడదు. ఏమిటి ఇది? పూర్వాపరాలు ఆలోచించే అంటున్నావా? నేను కేవలం ఇంటరు చదివినవాడిని. నువ్వు బి. ఏ. ప్యాసు అయిన దానివి. నేను రెండవ పెళ్ళివాడిని. నువ్వు బోలెడు ఆస్తికి వారసురాలివి. నాకు జీతం వినా వెనక ఏమీ లేదు. నేను నీకు ఏవిధంగానూ తగను. ఏమంటారు లోకులు?—నా సంరక్షణలో ఉన్నావు కాబట్టి, ఆస్తి కోసం బుట్టలో వేసుకున్నాను అని ఆడిపోస్తారు. ఆ అపవాదు భరించలేను వాసంతీ. బావ అభిప్రాయం నీకు......"

"నేను నీ భార్యను కావాలని. తోసిరాజంటే నా మనవి, పాదదాసిగా అన్నా స్వీకరించమని. రెంటికీ నిరాకరిస్తే ఎలాగా ఉంది అర్థరు." భావోద్రేకంలో ప్రతి మాటా విశితంగా వచ్చింది.

"పట్టినపట్టు వదలవా?" చిన్న మందలింపు ధ్వనించింది.

"పట్టు కాదిది—ప్రార్థన! నీ విలువలను తెలుసుకుని బేరీజు వేసిన నాన్న అంతిమ కోరిక. నామీద గౌరవం లేకపోయినా నాన్నమీది అభిమానం కొద్దీ అన్నా......"

ఇంతవరకూ సుధాకరరావు ముఖమండలాన్ని ఆవరించిన విషాదరేఖలు మాయమయ్యాయి.

"చీకటి ముసిరిన నా జీవితానికి వెలుగురేఖను ప్రసాదిస్తానంటావా వాసంతీ? నా సుఖంకోసం నీ నిండు జీవితాన్ని త్యాగం చేస్తావా? స్వర్గ సుఖాలను కాళ్ళ తన్నుకుంటావా? రాజా...."

నమిూపించి, వేలితో సుధాకరరావు పెదాలను తాకి, వారించి "వనిస్తూ ఉన్న క్షీరసాగరాన్ని విడిచి మృగతృష్ణల కోసం పయనించలేను స్వామీ!" అన్నది.

సుధాకరరావు బాహువులు వాసంతిని పెనవేసుకున్నాయి.

"వసంతకాల సందపసాన్ని ఈ చిన్న చేతులతో మట్టేయగలనని ఏనాడూ అనుకోలేదు నానూ!"

వాసంతి ముఖంలో కోటి మల్లెలు విరిశాయి. పెదాలు అవ్యక్తానందంతో వణికాయి. ★